క్లుప్తంగా

ఆలయాల్లో కమాండెంట్ ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కమాండెంట్ మల్లికాగార్గ్

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి, శివాలయాల్లో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమాండెంట్ మల్లికాగార్గ్ ఆలయాలను సందర్శించగా.. అర్చకులు, కమిటీ ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, ఆలయ కమిటీ కార్యదర్శి కోరాడ రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొండగుంపాంలో క్రీడాపోటీలు



పాఠశాల ఆవరణలో ఆటలాడుతున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం క్రీడాపోటీలు నిర్వహించారు. హెచ్ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు వివిధ సంప్రదాయబద్ధ ఆటల పోటీలను నిర్వహించి విజేతలను అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. క్రీడలపట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఆటలాడడం వల్ల ఆరోగ్యంతో పాటు చురుకుగా ఉంటారని, తద్వారా చదువుపై ఆసక్తి పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై వాసుదేవ్

విజయనగరం క్రైమ్: ద్విచక్ర వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని విజయనగరం రూరల్ ఎస్సై వాసుదేవరావు అన్నారు. బుధవారం స్థానిక వై జంక్షన్ వద్ద విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రతా నియమాలు అందరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



చందనోత్సవ ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని ఉల్లివీధిలో ఉన్న హజరత్ సయ్యద్ న్యాయత్‌షా వలీబాబా దర్గాలో ఉరుసు ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొండాడవీధి, డకినవీధి, కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా ఊరేగింపు చేపట్టినట్లు పట్టణ ముస్లింల శాఖ ప్రతినిధి షేక్ గౌస్‌బాషా తెలిపారు. దర్గాలో ప్రత్యేక పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మేమూన్ మసీద్ కమిటీ ప్రతినిధులు ఎస్కే సిద్దిక్, ఎం.డి.బహదూర్, మహ్మద్, సలామ్ షేక్‌అన్వర్, ఎస్కే బాబా, ఆజీమ్, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పురిటిపెంటలో వైద్య శిబిరం

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం-2 పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వ హించారు. శిబిరంలో 62మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అంద జేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు వైద్యాధికారి సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు.వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు పనులు పూర్తయ్యేదెప్పుడో..?

- కోడ్ ముగిసినా ప్రారంభం కాని అంబటి సత్రం జంక్షన్ – కొత్తపేట రోడ్డు విస్తరణ పనులు
- కార్పొరేషన్, విద్యుత్ శాఖల మధ్య సమన్వయలోపం
- విస్తరణ పనుల పూర్తిపై దృష్టి సారించని ప్రస్తుత ఎమ్మెల్యే అధితి
- మాజీ ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో రూ.3.15 కోట్ల నిధులు మంజూరు
- 60 అడుగుల వెడల్పుతో 500 మీటర్ల రోడ్డు నిర్మాణం
- విస్తరణ పనులు పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ సమస్య

విజయనగరం: జిల్లా కేంద్రంలో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే అంబటి సత్రం జంక్షన్ – కొత్తపేట రోడ్డు విస్తరణ మిగులు పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసి 50 రోజులు పూర్తవుతున్నా విస్తరణ పనులు పునఃప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయడంపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నగరంలోని వివిధ మార్గాలలో రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రగతి బాటలు వేసింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే 1.2 కిలోమీటర్ల పొడవుగల బాలాజీ జంక్షన్ – మయూరి జంక్షన్‌కు వెళ్లే ట్యాంక్ బండ్ రోడ్‌ను 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో 6 లేన్లుగా విస్తరించి వినియోగంలోకి తీసుకువచ్చిన విషయం విదితమే. ఇదే క్రమంలో నగరం నడిబొడ్డులో గల అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికల కోడ్ రాకతో నిలిచిపోయాయి. పనులు పూర్తయితే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో...

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో నగర సుందరీకరణ, రోడ్ల విస్తరణతో పాటు క్షేత్రస్థాయి పర్యటనల్లో గుర్తించిన అనేక ప్రజా సమస్యలను గుర్తించారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా అంబటిసత్రం, కొత్తపేట నీళ్ల ట్యాంక్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉండగా... గతంలో వచ్చిన నిధులు వినియోగించకపోవడంతో వెనక్కిమళ్లిపోయాయి. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి. మాజీ ఎమ్మెల్యే కోలగట్ల ప్రభుత్వ పెద్దలకు సమస్యను వివరించి వెనక్కి మళ్లిన నిధులను మంజూరు చేయించారు. దీంతో ఆర్అండ్‌బి అధికారులు పనులు ప్రారంభించారు.



విస్తరణ పనులు చేపట్టాల్సిన అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్లట్యాంక్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు ఇదే

అధికారుల మధ్య సమన్వయలోపం..

అంబటిసత్రం – కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ రహదారి విస్తరణ పనుల్లో కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టమవుతోంది. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ భవనాల తొలగింపు ప్రక్రియ మధ్యలోనే చేతులెత్తేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా... ఆ మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు సంబంధిత శాఖాధికారులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. వాస్తవానికి 2016లో విద్యుత్ శాఖాధికారులు ప్రతిపాదించిన విధంగా రూ. 50 లక్షలు కార్పొరేషన్ అధికారులు చెల్లించినట్లు తెలుస్తోంది. అయితే ఈ పనులపై విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యం వహించడమే విస్తరణ పనులకు జాప్యానికి కారణంగా తెలుస్తోంది. ఈ విషయమై నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

60 మీటర్ల వెడల్పుతో..

అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు 60 మీటర్ల వెడల్పుతో 500 మీటర్ల పొడవున రోడ్డు విస్తరణ పనులు 30 శాతం పూర్తయ్యాయి. మొత్తంగా రూ.4 కోట్లతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉండగా... 2014 – 19 సంవత్సరాల మధ్య రూ.85 లక్షల మేర ఖర్చు చేసి పనులు చేపట్టలేమంటూ చేతులెత్తేశారు. అనంతరం 2019 – 24 సంవత్సరంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిగిలిన రూ.3.15 కోట్లను మంజూరు చేసింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటివరకు 30 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తయితే ఈ రోడ్డు మీదుగా సులువుగా రాకపోకలు సాగించవచ్చు.

పూర్తి చేస్తాం..



నగరంలోని అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట రోడ్డు విస్తరణ పనులు ఇప్పటివరకు 30 శాతం చేపట్టాం. మిగిలిన పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. 500 మీటర్ల పొడవు గల రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం, బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. అంతేకాకుండా మార్గం వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియపై కార్పొరేషన్, విద్యుత్ శాఖాధికారులతో ఇటీవల చర్చించాం. ఈమార్గంలో రెండు, మూడు భవనాలు తొలగించాల్సి ఉంది. విషయాన్ని కార్పొరేషన్ అధికారులకు చెప్పాం. చిన్నపాటి సమస్యలు పరిష్కారమైతే పనులు పూర్తి చేస్తాం.

– టి.శ్రీనివాసరావు,
డీఈఈ, ఆర్అండ్‌బీ, విజయనగరం

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు 'అయ్యంకి'

డెంకాడ: గ్రంథాలయాల సుస్థిరతకు అయ్యంకి వెంకటరమణ అలుపెరగని పోరాటం చేశారని స్థానిక గ్రంథాలయం లైబ్రేరియన్ మహేష్ అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో అయ్యంకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి..

విజయనగరం అర్బన్: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు గ్రంథాలయ సేవా సంఘ ప్రతినిధులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.దామోదరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘ అధ్యక్షుడు కె.ఎర్రినాయుడు, సేవా సంఘ వ్యవస్థాపకుడు అబ్బుల్ రవూఫ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.నరసింహరావు, ఆర్.నవీన్‌కుమార్, లైబ్రేరియన్ ఆర్.వేణుగోపాల్, శివ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



డెంకాడ: అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్, తదితరులు



అర్బన్: సత్కారం పొందుతున్న జిల్లా గ్రంథాలయ సేవా సంఘ అధ్యక్షుడు ఎర్రినాయుడు

కుష్టువ్యాధిని త్వరగా గుర్తించాలి

- సబ్‌జైల్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: కుష్టువ్యాధిని త్వరగా గుర్తించాలని సబ్‌జైల్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌జైల్‌లోని ఖైదీలకు కుష్టు, హెచ్ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుష్టువ్యాధిని త్వరగా గుర్తించడం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చునని తెలిపారు. అలాగే హెచ్ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎస్‌టీఐ క్లినిక్ కౌన్సిలర్ డి.త్రినాథ్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ ఎల్.నాగరాజు, కో ఆర్డినేటర్ దేవీప్రియ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్

నిధుల కేటాయింపు హర్షణీయం



మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు

భోగాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం కల్పిస్తూ నిధులు కేటాయించడం హర్షణీయమని జనసేన పార్టీ నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడంతో పాటు రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. పదేళ్ల తర్వాత ఏపీకి మంచి రోజులు వచ్చాయని చెప్పారు. అదేవిధంగా జనసేన నాయకురాలు, స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవిని చీఫ్‌విప్‌గా నియమించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మట్టా అయ్యప్ప, వరుపుల సుధాకర్, మైలిపల్లి అప్పలకొండ, గుండపు సూరిబాబు, మాత నవీన్ కుమార్, బొల్లు త్రినాథ్, కర్రోతు శ్రీనివాసరావు, బాలిపల్లి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కవులవాడలో గ్రామసందర్శన

భోగాపురం: మండలంలోని కవులవాడలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొని పంచాయితీలో నెలకొన్న సమస్యలను అధికారులకు తెలియజేయాలని కోరారు.

పారసాం గ్రామంలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిడుతూరి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది హాజరుకావాలని కోరారు.

టోల్ ఫ్రీ నంబర్లను ఆశ్రయించాలి...

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్నప్పుడు చైల్డ్‌లైన్ 1098, 181, 100 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇచ్చి రక్షణ పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ సూచించారు. పట్టణంలోని శ్రీనివాస కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరిగినట్లయితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను బాలికలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, రూప, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా జామి యల్లారమ్మ



శాకాంబరీ దేవిగా దర్శనమిస్తున్న యల్లారమ్మ తల్లి

జామి: ఉత్తరాంధ్రలో ఎంతో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరీ దేవిగా బుధవారం దర్శనమిచ్చారు. ఆషాడ మాసం సందర్భంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారిని భక్తులు వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

ఆక్రమణలు తొలగించండి



తహసీల్దార్ ధర్మరాజుకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ సూర్యకళ

- ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం ఆలయ ప్రాంగణంలో ఆక్రమణలను గుర్తించి తొలగించాలని ఆర్డీఓ సూర్యకళ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని రామతీర్థంలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి దేవస్థాన భూములను దేవస్థానానికి మినహాయించాలని సూచించారు. షాపులతో పాటు ఇళ్లకు సంబంధించి నిర్వాహకులు చూపిస్తున్న పత్రాలను పరిశీలించి ఎంతవరకు ఆక్రమించారో గుర్తించాలన్నారు. పత్రాల ఆధారంగా కొలతలు వేసి ఆక్రమణలు తొలగించాలన్నారు. రాకపోకలకు అడ్డుగా ఉన్న షాపులను ముందుగా తొలగించాలని ఆదేశించారు. హక్కుపత్రాలు ఉన్న వారి జోలికి పోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధర్మరాజు, ఈఓ శ్రీనివాసరావు, రెవెన్యూ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు పట్టణ విద్యార్థులు



పతకాలతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విజయనగరం అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆగస్టు 16 నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయ తైక్వాండో పోటీలకు పట్టణానికి చెందిన శ్రీఆదిత్య స్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ బి.కల్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ఇద్దరు బంగారు, ముగ్గురు సిల్వర్, ఇద్దరు బ్రాంజ్ పతకాలు సాధించారని తెలిపారు. వారిలో సబ్ జూనియర్స్ కేటగిరి నుంచి సీహెచ్.పవన్ సాయి, వై.ధనుష్, మహ్మద్ షహ్నవాజ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. బుధవారం పాఠశాలలో విజేతలు, కోచ్ పరమేశ్‌లను పాఠశాల కరస్పాండెంట్ ఎ.ఉమానాయుడు, ప్రిన్సిపాల్ కల్యాణి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

విద్యార్థిని అదృశ్యం

గజపతినగరం : దత్తిరాజేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్టు గజపతినగరం పోలీసులకు ఆమె తండ్రి బుధవారం ఫిర్యాదు చేశారు. గజపతినగరంలోని ఓ ప్రైవేటు కళాశాలకు వెళ్లిన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు.

భగవద్గీత ప్రాముఖ్యత తెలుసుకోండి

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ శ్రీ మద్భగవద్గీత ప్రాముఖ్యతను తప్పనిసరిగా తెలుసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సర్వ విద్యానంద భారతి, రాజవిద్యా నంద సరస్వతి సాములు స్పష్టం చేశారు. స్థానిక కొత్తగవిడి వీధిలోని గీతామందిరాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శ్రీమద్భగవద్గీత చదివితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ప్రధానంగా మానవధర్మం కోసం చాలా స్పష్టంగా లిఖించబడిందన్నారు. తెల్లదొరలు నుంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మగాంధీ గీతను ఆచరించడం ద్వారానే ఎన్నో సమస్యలకు పరిష్కారం తెలుసుకున్నట్లు చెప్పారు. గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, గీతాసత్సంగ్ సేవా సభ్యులు పాల్గొన్నారు.



గీతామందిరంలో మాట్లాడుతున్న స్వామీజీలు

అన్ని వర్గాలకు అనుకూలమైన బడ్జెట్

విజయనగరం టౌన్: వికసిత్ భారత్ లక్ష్యంగా రూపొందించిన 2024 – 25 వార్షిక బడ్జెట్ అన్ని రాష్ట్రాలకు, అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైనదని బీజేపీ విజయనగరం అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో పేదలు, మహిళలు, యువత, రైతులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేశారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్‌ను తలపించే విధంగా కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఎనిమిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి భారత దేశ చరిత్రలో తన పేరు నమోదు చేసుకోవడం మనకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పిల్లా నవీన్, బీజేపీ నాయకులు గిడిజాల అప్పలనాయుడు, శ్రీధర్, నీలాపు దేవి, సోము మహేష్, గిరిబాబు, కంది సీతారాం, గిరీష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు సుధీర్, తదితరులు

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయండి

గజపతినగరం రూరల్: మండలంలోని కౌలు రైతులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయాల్సిందేనని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) మహరాజన్ అన్నారు. మండలంలోని పి.ఎస్.ఆర్.పురంలోని యూనియన్ బ్యాంకును బుధవారం సందర్శించారు. ఈసంద ర్భంగా బ్యాంకు అధికారులతో కౌలురైతుల రుణాలపై చర్చించారు. బ్యాంకు మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతుల కు రుణాలు మంజూరు చేస్తామని ఏడీఏ తెలిపారు. రెవెన్యూ శాఖ నుంచి రైతుల సీసీఆర్సీ జాబితా రాగానే రుణాల ప్రక్రియ ప్రారంభిస్తా మన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ మహరాజన్

నేటితో అడ్మిషన్లకు గడువు పూర్తి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు గురువారంతో గడువు ముగుస్తోందని ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు తెలి పారు. గురువారం ఆయన అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులను కలిసి ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాయిన్ కావాలని కోరారు. కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, డిజిటల్ క్లాసులు, అన్ని ల్యాబ్‌లు, లైబ్రరీ వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు వస్తే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. ప్రిన్సిపాల్ వెంట కళాశాల లెక్చరర్లు జి.ఈరన్న, షేక్ వలీఖాన్, పి.భాస్కరరావు ఉన్నారు.